క్లుప్తంగా

నేడు రక్తదాన శిబిరం

మొయినాబాద్: డాక్టర్ అంబేడ్కర్ 132వ జయంతిని సందర్భంగా ఏబీవీపీ ఆధ్వర్యంలో గురువారం రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నట్లు ఏబీవీపీ రాష్ట్ర నాయకుడు శాపురం శ్రీకాంత్ బుధవారం తెలిపారు. మండల కేంద్రంలోని పద్మావతి గార్డెన్‌లో ఉదయం 10 గంటలకు రక్తదాన శిబిరం ప్రారంభమవుతుందని ఆయన చెప్పారు. యువకులు, విద్యార్థులు స్వచ్ఛందంగా ముందుకొచ్చి రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని కోరారు.

టీకాలను వేయించాలి

డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జయలక్ష్మి



టీకాలను పరిశీలిస్తున్న డాక్టర్ జయలక్ష్మి

కొత్తూర్: పుట్టిన పిల్లలకు రెండు సంవత్సరాల వరకు క్రమం తప్పకుండా వ్యాధి నిరోధక టీకాలను వేయించాలని షాద్‌నగర్ డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జయలక్ష్మి అన్నారు. మండలంలోని పెంజర్ల గ్రామంలోని సబ్ సెంటర్‌ను డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ జయలక్ష్మి బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సబ్ సెంటర్‌లో టీకాలు వేసే విధానాన్ని ఆమె పరిశీలించారు. సిబ్బంది అందుబాటులో ఉండి క్రమం తప్పకుండా టీకాలను వేస్తున్నారా అని అక్కడికి వచ్చిన లబ్ధిదారులను అడిగి తెలుసుకున్నారు. గర్భిణులకు టీటీ వ్యాక్సినేషన్‌ను సరైన సమయంలో అందించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో హెల్త్ ఎడ్యుకేటర్ శ్రీనివాసులు, ఎఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

చెత్త డంప్ పరిశీలన



చెరువు పరిసరాలను పరిశీలిస్తున్న డీఎల్‌పీఓ మల్లారెడ్డి

షాద్‌నగర్: మండల పరిధిలోని అయ్యవారిపల్లి గ్రామాన్ని బుధవారం డీఎల్‌పీఓ మల్లారెడ్డి సందర్శించారు. గ్రామంలో సేకరించిన చెత్తను గ్రామ శివారులోని చెరువులో డంప్ చేస్తున్న విషయంపై కొందరు గ్రామస్తులు ఇటీవల జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో డీఎల్‌పీఓ మల్లారెడ్డి, ఎంపీఓ కల్యాణి గ్రామాన్ని సందర్శించి చెత్తను డంప్ చేస్తున్న చెరువు పరిసరాలను పరిశీలించారు. అనంతరం గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఈ విషయంపై విచారణ చేపట్టారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేయనున్నట్లు మల్లారెడ్డి తెలిపారు.

ఉచిత వైద్య శిబిరాలతో లబ్ధి

సర్పంచ్ సంధ్యారాణి



వైద్య పరీక్షలు చేస్తున్న డాక్టర్లు

షాబాద్: పేదలు ఉచిత వైద్య శిబిరాలను సద్వినియోగం చేసుకోవాలని కుర్వగూడ గ్రామ సర్పంచ్ సంధ్యారాణి పేర్కొన్నారు. బుధవారం మండలంలోని కుర్వగూడ గ్రామంలో చేవెళ్లకు చెందిన పట్నం మహేందర్‌రెడ్డి మెడికల్ కళాశాల వైద్యులు ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ప్రజలకు వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సంధ్యారాణి మాట్లాడుతూ.. ఉచిత వైద్య శిబిరాలు పేదలకు దేవుడిచ్చిన వరమన్నారు. పేదలకు కార్పొరేట్ స్థాయిలో వైద్యం అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నిర్వహించే ఉచిత వైద్య శిబిరాలను పేద ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు మల్లికార్జున్‌గౌడ్, వైద్య సిబ్బంది, గ్రామస్తులు తదితరులున్నారు.

ఒలంపియాడ్ పరీక్షల్లో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

షాద్‌నగర్‌టౌన్: ఇండియన్ నేషనల్ టాలెంట్ సెర్చ్ ఒలంపియాడ్ వారు నిర్వహించిన పోటీ పరీక్షల్లో షాద్‌నగర్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరిచారు. పట్టణంలోని శ్రీ చైతన్య పాఠశాల విద్యార్థులు అమీన్, సింగ్‌నిత్య, అనుష్క, విశ్వజతో పాటు 51 మంది విద్యార్థులు ప్రతిభ కనబర్చి బహుమతులు అందుకున్నట్లు పాఠశాల ప్రిన్సిపాల్ ఆనంద్ తెలిపారు. ఉత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులను పాఠశాల యాజమాన్యం అభినందించడంతో పాటుగా, ధ్రువపత్రాలు, మెడల్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ శ్రీధర్, శ్రీవిద్య, సుధాకర్, రఘు, మధు, తిరుమల్ రెడ్డి, వీరేందర్, భానుచందర్ పాల్గొన్నారు.

మహనీయుల ఆశయాలే ఆదర్శం

విద్యాశాఖ మంత్రి సబితారెడ్డి



అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించి నివాళులర్పిస్తున్న మంత్రి, ఎమ్మెల్యే తదితరులు

చేవెళ్ల: మన దేశ ఔన్నత్యాన్ని చాటిన మహనీయులను స్మరించుకుంటూ వారి ఉత్సవాలను జరుపుకొనే పవిత్రమాసం ఏప్రిల్ అని మంత్రి సబితా రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని అల్లవాడ గ్రామంలో దాత ఎంపీటీసీ సత్యనారాయణ చారి ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహం, న్యాలట గ్రామంలో అంబేడ్కర్ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే కాలె యాదయ్య ఏర్పాటు చేసిన అంబేడ్కర్ విగ్రహాన్ని బుధవారం ఎమ్మెల్యే, జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ పి.క్రిష్టారెడ్డిలతో కలిసి ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. మహనీయుల ఆశయ సాధనకు సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారని అన్నారు. హైదరాబాద్ నగర నడిబొడ్డున ఎత్తైన బాబాసాహెబ్ అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసి ఆయన జయంతి రోజున ప్రారంభించనున్నట్లు ఆమె తెలిపారు. అంబేడ్కర్ కలల సాకారం చేసే దిశగా ప్రభుత్వం చేస్తున్న కృషికి ప్రతి ఒక్కరి భాగస్వామ్యం కావాలన్నారు. అందరు చదువుకున్నప్పుడే మహనీయుల ఆశయాలను నెరవేర్చగలుగుతామన్నారు. ప్రతి గ్రామంలో మహనీయుల విగ్రహాలు ఏర్పాటు చేసి ఉత్సవాలను ఘనంగా జరుపుకోవడం నిజంగా సంతోషకరమన్నారు. ప్రపంచ దేశాలకు మన ఖ్యాతిని విస్తరింపజేసిన మహనీయుడు అంబేడ్కర్ అని ఆయన గురించి ఎంత చెప్పిన తక్కువే ఆమె వివరించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ మాలతి, మార్కెట్ కమిటీ చైర్మన్ మిట్ట వెంకటరంగారెడ్డి, వైస్ ఎంపీపీ కర్నె శివప్రసాద్, సర్పంచులు బీమ్‌రెడ్డి, మల్లారెడ్డి, లక్ష్మి సత్యనారాయణ, ఎంపీటీసీ సత్యనారాయణచారి, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు రవీందర్‌రెడ్డి, నాయకులు రమణారెడ్డి, ఎం క్రిష్టారెడ్డి, పి. ప్రభాకర్, ఎం. మోహన్‌రెడ్డి, రమగౌడ్, వెంకటేశ్, నరేందర్, బి.మాణిక్యరెడ్డి, నాగార్జున్‌రెడ్డి, జహంగీర్, నరేందర్, కుంచం శివకుమార్, సాయినాథ్, ఎల్లయ్య, దర్శన్, గని, అంబేడ్కర్ సంఘం నాయకులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

ముడిమ్యాలలో మంత్రి సబిత పర్యటన

చేవెళ్ల: నియోజకవర్గంలోని ముడిమ్యాల గ్రామంలోని మాజీ డీసీసీ అధ్యక్షుడు పడాల వెంకటస్వామి ఇటీవల నూతన గృహ ప్రవేశం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అప్పట్లో హాజరు కాలేక పోవడంతో మంత్రి ప్రత్యేకంగా ఈ రోజు ఆయన ఇంటికి వెళ్లి కలిశారు. మంత్రి సబితారెడ్డితో పాటు ఎమ్మెల్యే కాలె యాదయ్య, జెడ్పీ చైర్‌పర్సన్ అనితారెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ క్రిష్టారెడ్డిలు కూడా ఉన్నారు. ఈ సందర్భంగా వెంకటస్వామిని ఆరోగ్య ఎలా ఉందని అడిగి తెలుసుకున్నారు. ఇంద్రారెడ్డి హయాం నుంచి తమ వెంట ఉండి ఎంతో నమ్మకంగా వెంకటస్వామి అన్న పని చేశారని జిల్లాపరిషత్ చైర్‌పర్సన్ అనితారెడ్డికి మంత్రి సబితా రెడ్డి చెప్పారు. కుటుంబసభ్యులతో కలిసి ఫొటోలు దిగారు. అనంతరం ముడిమ్యాల సర్పంచ్ శేరి స్వర్ణలత దర్శన్ ఆహ్వానంతో వారి ఇంటికి వెళ్లారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఆధ్వర్యంలో గ్రామంలో చేపట్టిన అభివృద్ధి పనులు సీసీ రోడ్లు, కోదండ రామాలయం నిర్మాణం, తదితర వాటిని తెలియజేశారు. గ్రామాభివృద్ధికి కృషి చేస్తున్న సర్పంచ్ శేరి స్వర్ణలత దర్శన్‌ను మంత్రి, జెడ్పీ చైర్‌పర్సన్, ఎమ్మెల్యే అభినందించారు. కార్యక్రమంలో గ్రామ నాయకులు, బీఆర్‌ఎస్ పార్టీ నాయకులు, తదితరులు ఉన్నారు.



డీసీసీ మాజీ అధ్యక్షుడు వెంకటస్వామి కలిసిన మంత్రి సబితారెడ్డి, తదితరులు

అభివృద్ధి, సంక్షేమం ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

షాద్‌నగర్: అభివృద్ధి, సంక్షేమం బీఆర్‌ఎస్ ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ పేర్కొన్నారు. బుధవారం కేశంపేట మండలంలోని లేమామిడి సర్పంచ్ శ్రీశైలంగౌడ్, గోగు జగత్‌రెడ్డితో పాటు 250 మంది కాంగ్రెస్ పార్టీ నేతలు ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ సమక్షంలో బీఆర్‌ఎస్‌లో చేరారు. ఈ సందర్భంగా బీఆర్‌ఎస్‌లో చేరిన వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వం అన్ని వర్గాల అభ్యున్నతితో పాటుగా, పట్టణం, పల్లెలను అభివృద్ధి చేస్తుందని అన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో సీఎం కేసీఆర్ అభివృద్ధి సంక్షేమ పథకాలను చేపడుతున్నారని తెలిపారు. తెలంగాణ అభివృద్ధిలో నంబర్ వన్ స్థానంలో నిలిచిందని చెప్పారు. గత ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన సీఎం కేసీఆర్ హామీలను నెరవేరుస్తున్నారని అన్నారు. సంక్షేమ పథకాలకు ఆకర్షితులై వివిధ పార్టీల నేతలు బీఆర్‌ఎస్‌లో చేరుతున్నారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారిలో ఉప సర్పంచ్ చాకలి రవి, వార్డు సభ్యులు వెంకటేశ్వర్‌రెడ్డి, శ్రీనివాసులు, ఆంజనేయులు, కాతావత్ రవి, బైండ్ల యాదయ్య, నర్సింహ్మా, జహంగీర్, అంజయ్య నర్సింహ్మా, అమర్‌నాథ్‌రెడ్డి, ఈశ్వర్‌నాయక్, రమేష్, సైదులు, చెన్నయ్య, అల్లాజి, కుమార్‌గౌడ్, అమీర్, బాసిద్, భరత్‌రెడ్డి, ఆంజనేయులు, శివశంకర్, జంగయ్య ఉన్నారు.



పార్టీలో చేరిన నేతలతో ఎమ్మెల్యే అంజయ్య యాదవ్

రుతుచక్రంపై అవగాహన



కార్యక్రమంలో పాల్గొన్న విద్యార్థులు, సభ్యులు

చేవెళ్ల: మండల కేంద్రంలోని జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థినులకు రుతుచక్రంపై హోప్, సోషల్ వెల్ఫేర్ క్లబ్ ఆఫ్ విద్యాజ్యోతి ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ విద్యార్థుల బృందం ''ప్రాజెక్ట్ లాల్'' అనే అవగాహన కార్యక్రమం నిర్వహించారు. బుధవారం హోప్ బృందం పాఠశాలలోని విద్యార్థినులకు శానిటరీ ప్యాడ్‌లను పంపిణీ చేసి వాటిని ఎలా ఉపయోగించాలో అవగాహన కల్పించారు. చిన్న వయస్సు నుంచే ఆరోగ్యం, రుతుశ్రేయస్సు గురించి అవగాహన కలిగి ఉండాలన్నారు. దీనిపై ఎవరు భయపడి ఆందోళన చెందాల్సిన పని లేదని స్వేచ్ఛగా ఉండాలని చెప్పారు.

పేదలకు సంక్షేమ పథకాలే శ్రీరామ రక్ష

ఎంపీపీ నక్షత్రంజేవంతు



చెక్కులు పంపిణీ చేస్తున్న ప్రజాప్రతినిధులు

మొయినాబాద్‌రూరల్: ప్రభుత్వం అమలు చేస్తున్న షాదీముబారక్, కల్యాణలక్ష్మి పథకాలు పేదలకు శ్రీరామ రక్ష అని ఎంపీపీ నక్షత్రంజేవంతు, జెడ్పీటీసీ శ్రీకాంత్‌లు అన్నారు. బుధవారం మండలంలోని ఆయా గ్రామాలకు చెందిన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమం జెడ్పీటీసీ కాలె శ్రీకాంత్ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా 20 షాదీముబారక్, 10 కల్యాణలక్ష్మి చెక్కుల పంపిణీ మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. దేశంలో ఎక్కడ లేని విధంగా రాష్ట్రంలో సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు కొనసాగుతున్నాయని చెప్పారు. కార్యక్రమంలో సర్దార్ నగర్ మాజీ మార్కెట్ వైస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి, మండల సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు నరోత్తమ్‌రెడ్డి, తహసీల్దార్ అశోక్‌కుమార్, ఎంపీడీఓ సంధ్య, వెంకటాపూర్ సర్పంచ్ మనోజ్‌కుమార్, రాష్ట్ర సర్పంచ్‌ల సంఘం ఉపాధ్యక్షురాలు, హిమాయత్‌నగర్ సర్పంచ్ మంజుల, ఎంపీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, పెద్దమంగళారం ఎంపీటీసీ లత, సాగర్ పాల్గొన్నారు.

కార్యదర్శులను రెగ్యులర్ చేయండి



ఎంపీపీకి వినతిపత్రం ఇస్తున్న కార్యదర్శులు

చేవెళ్ల: జూనియర్ పంచాయతీ కార్యదర్శుల ప్రొబేషనరీ కాలం నాలుగేళ్లు పూర్తయింది. కావునా, ఉద్యోగాల క్రమబద్ధీకరణ ప్రక్రియను వెంటనే ప్రారంభించాలని జూనియర్ పంచాయతీ కార్యదర్శుల సంఘం సభ్యులు డిమాండ్ చేశారు. బుధవారం ఎంపీపీ ఎం.విజయలక్ష్మిని కలిసి వినతి పత్రం అందజేశారు. అనంతరం ఎంపీపీ ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి అందరికి తినిపించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ప్రభుత్వం 2019 ఏప్రిల్ 12న ప్రతి పంచాయతీకి ఒక కార్యదర్శి ఉండాలనే ఉద్దేశంతో 9,355 మంది పంచాయతీ కార్యదర్శులను నియమించిన విషయం తెలిసిందే. అప్పటి నోటిఫికేషన్ ప్రకారం 3 సంవత్సరాలకే క్రమబద్ధీకరించాల్సి ఉండగా జీఓ నం.26 జారీతో మరో సంవత్సరం ప్రొబేషన్ పెంచారన్నారు. దీంతో ఏప్రిల్ 12తో నాలుగేళ్లు పూర్తయిందని తెలిపారు. ప్రభుత్వం వెంటనే కార్యదర్శుల ఉద్యోగాలను క్రమబద్ధీకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండలంలోని సీనియర్, జూనియర్ పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

సమన్వయంతోనే సమస్యలు పరిష్కారం

ఎంపీపీ విజయలక్ష్మి

చేవెళ్ల: అధికారులు, ప్రజాప్రతినిధులు సమన్వయంతో పనిచేస్తేనే అభివృద్ధి సాధ్యమవుతుందని ఎంపీపీ విజయలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో ఆయా శాఖల వారీగా పూర్తయిన అభివృద్ధి, చేపడుతున్న పనులపై చర్చించారు. అధికారులు శాఖల వారీగా అంశాలను సభలో చదివి వినిపించారు. పలు గ్రామాల్లో ఉన్న సమస్యలను ఎంపీటీసీలు, సర్పంచులు ప్రస్తావించారు. గ్రామాల్లో రైతులు ధరణి సమస్యలతో ఇబ్బందులు పడుతున్నారని వాటిని పరిష్కరించే వీలులేక నానా అవస్థలు పడుతున్నారని సభ దృష్టికి తెచ్చారు. తహసీల్దార్ కార్యాలయంలో అడిగితే కలెక్టర్ కార్యాలయం నుంచి రావాల్సిందేనని అంటున్నారని, రైతులు కలెక్టర్ కార్యాలయానికి ఎలా వెళ్తారని వాపోయారు. ధరణిలో ఉన్న సమస్యలు త్వరగా పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పలు గ్రామాల్లో విద్యుత్ సమస్యలు, ప్రధాన రోడ్ల సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ సందర్భంగా ఎంపీపీ మాట్లాడుతూ.. సమస్యలపై అందరు కలిసి మెలిసి పరిష్కరించుకోవాలని చెప్పారు. ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి పనులు గ్రామాల్లో ప్రజలకు కనిపిస్తున్నాయని చెప్పారు. ప్రభుత్వం నుంచి అధిక నిధులు మండలానికి తీసుకువచ్చేందుకు కృషి చేస్తున్నట్లు చెప్పారు. గ్రామాల్లో అనేక అభివృద్ధి పనులు జరుగుతున్నాయని ప్రభుత్వం గ్రామాల అభివృద్ధికి ప్రత్యేక నిధులు ఇస్తూ సహకరిస్తుందని చెప్పారు. మండల సర్వసభ్య సమావేశాలకు అధికారులు అందరూ తప్పక హాజరు కావాలని తెలిపారు. ఈ సమావేశంలో ఎంపీడీఓ రాజ్‌కుమార్, తహసీల్దార్ శ్రీనివాస్, డీఈఈ జగన్‌రెడ్డి, ఎంఈఓ అక్బర్, సీడీపీఓ శోభారాణి, మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, వివిధ శాఖల అధికారులు, కార్యదర్శులు పాల్గొన్నారు.

బెదిరింపులతో కాదు.. ఆకర్షితులమై..

బీఆర్‌ఎస్‌లో చేరిన నేతల స్పష్టీకరణ



మాట్లాడుతున్న బీఆర్‌ఎస్ నాయకులు

నందిగామ: బీఆర్‌ఎస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు నచ్చి ఆ పార్టీలో తాము స్వచ్ఛందంగా చేరామని ఇటీవల బీఆర్‌ఎస్‌లో చేరిన నేతలు స్పష్టం చేశారు. మండల కేంద్రమైన నందిగామలో బుధవారం విలేకరుల సమావేశంలో మాజీ ఉప సర్పంచ్ చించేటి కృష్ణ, టైలర్ కృష్ణ మరి కొంత మంది నాయకులు మాట్లాడారు. అధికార బీఆర్‌ఎస్ నాయకుల బెదిరింపులకు భయపడి, పోలీసు కేసులకు భయపడి బలవంతగా కాంగ్రెస్ నాయకులను బీఆర్‌ఎస్ పార్టీలో చేర్చుకున్నారని కాంగ్రెస్ నాయకులు ఆరోపించడం హాస్యాస్పదంగా ఉందని విమర్శించారు. తమని ఎవ్వరు బెదిరించలేదని, ఎవ్వరూ బలవంత పెట్టలేదని, ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి సంక్షేమ పథకాలు నచ్చి, ఎమ్మెల్యే అంజయ్య యాదవ్ చేస్తున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులమై బీఆర్‌ఎస్‌లో చేరామని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మునిగిపోయే నావ లాంటిదని, కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేదిలేదు.. అభివృద్ధి చేసేది లేదని వారు విమర్శించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ నాయకులు వాస్తవాలను తెలుసుకొని మాట్లాడాలని హితవు పలికారు. కొంత మంది నాయకులకు నందిగామలో చేసిన అభివృద్ధి కనపడడం లేదని, ఒక్కసారి చౌరస్తా వద్దకు వస్తే అభివృద్ధి ఎక్కడ ఉందో చూపిస్తామని అన్నారు. కార్యక్రమంలో నాయకులు స్వామీ, రవియాదవ్, శ్రీనుగౌడ్, దామోదర్ రెడ్డి, చైతన్య, రాజు, గోపాల్, జంగయ్య, రమేష్, చందు, శ్రీకాంత్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

వీర్లపల్లి ప్రవర్తన నచ్చకే పార్టీ వీడుతున్నాం

- శంకర్ ఒంటెత్తు పోకడతో కాంగ్రెస్ ఖాళీ
- కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు ఆశన్నగౌడ్ సంచలన వ్యాఖ్యలు



సమావేశంలో మాట్లాడుతున్న ఆశన్నగౌడ్

షాద్‌నగర్‌రూరల్: టీపీసీసీ రాష్ట్ర కార్యదర్శి, నియోజకవర్గ కాంగ్రెస్‌పార్టీ ఇన్‌చార్జి వీర్లపల్లి శంకర్ ప్రవర్తన నచ్చకనే మూకుమ్మడిగా రాజీనామాలు చేసి కాంగ్రెస్ పార్టీని వీడుతున్నామని ఈ పార్టీ మండల అధ్యక్షుడు ఆశన్నగౌడ్ పేర్కొన్నారు. శంకర్ ఒంటెత్తు పోకడతో నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ ఖాళీ కావడం ఖాయమని ఆశన్నగౌడ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. బుధవారం ఆశన్నగౌడ్ అధ్యక్షతన విలేఖరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మండల పరిధిలోని దేవునిపల్లి సర్పంచ్ చేగూరి రాఘవేందర్‌గౌడ్, ఉపసర్పంచ్, వార్డు సభ్యులు, ఎల్లంపల్లి సర్పంచ్ కృష్ణయ్య , వార్డు సభ్యులు, రాయికల్ వార్డు సభ్యులు, కాంగ్రెస్ నాయకులు కాంగ్రెస్ పార్టీకి మూకుమ్మడిగా రాజీనామాలు చేస్తున్నట్లు ప్రకటించారు. త్వరలోనే పెద్ద ఎత్తున ఎమ్మెల్యే అంజయ్యయాదవ్ సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరనున్నట్లు చెప్పారు. ఈ సందర్భంగా ఆశన్నగౌడ్ మాట్లాడుతూ.. తమ రాజకీయ జీవితం కాంగ్రెస్ పార్టీలోనే ప్రారంభించామని, గత 22ళ్లుగా పార్టీకి ఎన్నో సేవలను అందించామని చెప్పారు.

శంకర్ లేకపోతే షాద్‌నగర్‌లో కాంగ్రెస్ లేదు

టీపీసీసీ సభ్యుడు మహ్మద్‌అలీఖాన్ బాబర్



మాట్లాడుతున్న మహ్మద్‌అలీఖాన్ బాబర్

షాద్‌నగర్‌రూరల్: నియోజకవర్గంలో బీఆర్‌ఎస్ పార్టీకి ఓటమి భయం పట్టుకుంది. అభివృద్ధి పేరుతో కాంగ్రెస్ నాయకులను కొంటున్నారని టీపీసీసీ సభ్యుడు మహ్మద్‌అలీఖాన్ బాబర్ అన్నారు. బుధవారం పట్టణంలోని వి కన్వెన్షన్ హాలులో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీని ఎదుర్కోలేక బీఆర్‌ఎస్ పార్టీ కాంగ్రెస్ నాయకులను కొనుగోలు చేస్తుందని ఆరోపించారు. అభివృద్ధి పేరుతో కొందరు నాయకులు అమ్ముడుపోతున్నారని, అలాంటి వారితో పార్టీకి ఎలాంటి నష్టం లేదని పేర్కొన్నారు. ఆశన్నగౌడ్ తన సొంత వ్యాపార కార్యకలాపాల కోసమే పార్టీపై లేనిపోని ఆరోపణలు చేసి పార్టీని వీడిపోతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలో కాంగ్రెస్ గెలుపు బాటలో ఉన్నట్లు సర్వేలు చెపుతున్నాయని, అందుకు భయపడి బీఆర్‌ఎస్ నేతలు కాంగ్రెస్ నాయకులను కొంటున్నారని మండిపడ్డారు. ఆశన్నగౌడ్ చేసిన ఆరోపణలో వాస్తవం లేదని, షాద్‌నగర్‌లో వీర్లపల్లి శంకర్ లేకపోతే కాంగ్రెస్ పార్టీ లేదన్నారు. అనంతరం కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా చల్లా శ్రీకాంత్‌రెడ్డి, కార్యనిర్వాహక అధ్యక్షుడిగా సింగారం సుదర్శన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అనంతరం వారిని పూలమాలలు, శాలువాలతో సన్మానించారు.

విద్యార్థుల భవిష్యత్తు కోసం పోరాటం


వైఎస్సార్ టీపీ నాయకుడు ఇబ్రహీం

షాద్‌నగర్: విద్యార్థుల భవిష్యత్తు కోసం పార్టీలకు అతీతంగా రాజీలేని పోరాటం చేయాల్సిన అవసరం ఎంతైనా ఉందని వైఎస్సార్ తెలంగాణ పార్టీ నియోజకవర్గ కోఆర్డినేటర్ ఇబ్రహీం అన్నారు. వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు ప్రతిపాదించిన టీ సేవ్ కార్యాచరణకు సంబంధించిన మెమోరాండంను బుధవారం షాద్‌నగర్‌లోని ఆర్డీఓ కార్యాలయంలో అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఇబ్రహీం మాట్లాడుతూ... రాష్ట్రంలో నియంతపాలన కొనసాగుతోందని అన్నారు. నిరుద్యోగులు గత 9ఏళ్లుగా అన్యాయానికి గురవుతున్నారని చెప్పారు. పార్టీలకు అతీతంగా నేతలందరూ జెండా ఎజెండాలను పక్కన పెట్టి పోరాటం చేయాల్సిన అవసరం ఉందన్నారు. నిరుద్యోగుల భవిష్యత్తు కోసం స్టూడెంట్స్ యాక్షన్ ఫర్ వేకెన్సీస్, ఎంప్లాయిమెంట్ (టీసేవ్) ఫోరాన్ని షర్మిల ఏర్పాటు చేసిందని తెలిపారు. బీఆర్‌ఎస్ ప్రభుత్వం ప్రశ్నించే గొంతులను నొక్కే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. ప్రతిపక్ష నేతలపై అక్రమ కేసులు నమోదు చేయడం, అరెస్టు చేయించడం చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. అందరు ఏకతాటిపైకి వచ్చి పోరాటం చేసి సీఎం కేసీఆర్ మెడలు వంచాలని అన్నారు. ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి ప్రజలు, తగిన బుద్ధి చెప్పడం ఖాయమని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా యువత విభాగం అధ్యక్షుడు శీలం శ్రీను, నాయకులు డేవిడ్ రాజు, వంశీ, పైజాన్, నర్సింహ్మా, ఇసాక్, భిక్షపతి, ప్రకాష్‌చారి, రాము, సాయి, కొక్కురవి, మతిన్, దీపక్, ప్రశాంత్, వివేక్, ప్రసాద్, మనీష్ తదితరులు పాల్గొన్నారు.

అందరి సహకారంతో అభివృద్ధి

మొయినాబాద్‌రూరల్: గ్రామాల అభివృద్ధిలో అధికారులు, ప్రజాప్రతినిధుల సహకారం అవసరమని జెడ్పీటీసీ కాలె శ్రీకాంత్, ఎంపీపీ నక్షత్రం జేవంతులు అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయంలో మండల అభివృద్ధి అధికారి సంధ్య అధ్యక్షతన సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలె శ్రీకాంత్, ఎంపీపీ నక్షత్రంజేవంతులు మాట్లాడుతూ.. గ్రామాల అభివృద్ధి చేసుకున్నప్పుడే సమస్యలు ఉండవని సూచించారు. ఎండాకాలంలో తాగునీటి సమస్య రాకుండా చూడాలన్నారు. అదే విధంగా గ్రామాల్లో ప్రజలందరిని పీఎంజేబీవై, పీఎంఎస్‌వై బీమా చేయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సంధ్య, ఎంపీఓ వెంకటేశ్వర్‌రెడ్డి, ఏపీఎం రవీందర్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అమ్మవారికి పూజలు



అమ్మవారికి పూజలు నిర్వహిస్తున్న గ్రామస్తులు

మొయినాబాద్: మండలంలోని సురంగల్ కట్టమైసమ్మ దేవాలయంలో అమ్మవారికి ఘనంగా పూజలు నిర్వహించారు. ఆలయ పునర్నిర్మాణం చేసి విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవాలు నిర్వహించి 48 రోజులు పూర్తయిన సందర్భంగా ఆలయంలో మూడు రోజుల పాటు పూజలు జరిపారు. ఇందులో భాగంగా బుధవారం సహస్ర ఘటానిషేచన, మహాకుంభాభిషేక క్రతువు మహోత్సవాలు కనుల పండువగా జరిగాయి. వేద పండితుల మంత్రోచ్ఛరణలతో ఆలయ ప్రాంగణమంతా మార్మోగింది. అమ్మవారికి పూర్ణాహుతి, కుంభోద్వాసన, కళావాహనలు, లయాంగ కల్పన, బింబసాంస్కరము, సహస్ర ఘటాభిషేకం, శిఖరాభిషేకం, పూర్ణాభిషేకం పూజలు నిర్వహించారు. అమ్మవారికి 1296 కలశలతో కలిశాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన విజయభాస్కర్‌రెడ్డి, సీతారాంరెడ్డి, జైపాల్‌రెడ్డిలు భక్తులకు అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. పూజా కార్యక్రమంలో సర్పంచ్ గడ్డం లావణ్యతో పాటు పలువురు ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆగితే.. తోసుడే

మొయినాబాద్: హైదరాబాద్ నుంచి పరిగికి వెళ్తున్న పరిగి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు బుధవారం సాయంత్రం మొయినాబాద్ బస్టాపులో ఆగిపోయింది. డ్రైవర్ ఎంత ప్రయత్నించినా బస్సు స్టార్ట్ కాలేదు. వెనకాల ట్రాఫిక్ నిలిచిపోయింది. దీంతో బస్సులోని ప్రయాణికులు, కండక్టర్ దిగి బస్సును ముందుకు తోశారు. కొంత దూరం తోశాక బస్సు స్టార్ట్ కావడంతో ప్రయాణికులంతా ఎక్కి వెళ్లిపోయారు. ఎండాకాలం కావడంతో బస్సులు అప్పుడప్పుడు ఇలా మోరాయించడం పరిపాటే అంటూ ప్రయాణికులు మాట్లాడుకోవడం కనిపించింది.



బస్సును ముందుకు తోస్తున్న ప్రయాణికులు